# పార్కు బెంచీ సాక్షి

## పంతుల శ్రీరామశాస్త్రి

నాకు స్వంతంగా ఎవ్వరితోనూ ఎటువంటి లావాదేవీలు లేకపోయినా నేను కోర్టుకి వెళ్లవలసి వచ్చింది. ఒకానొక క్రిమినల్ కేసులో సాక్ష్యం చెప్పక తప్పింది కాదు. ముద్దాయి మా మేనమామకి కొంచెం కావలసినవాడు, ఆయనవచ్చి "నరసింహం! నీకు కోర్టుకిరావడమంటే ఇష్టంలేదని తెలుసునుగాని, మరి తప్పదు, ఏం చెయ్యమన్నావు?" అన్నాడు. "సరే, కానీ" అన్నాను, నాకూ విజయనగరంలో కొంచెం బజారుపని ఉందికదా అని.

తీరావెళ్తే కేసు వాయిదాపడింది. మా మామయ్య జనతాలో అనకాపల్లి వెళ్లవలసుంది అని రైలుస్టేషనుకి బయలుదేరేడు. నేను బజారుకివెళ్ళి అక్కడనుండి బస్సులో వెళ్లిపోతానన్నాను.

బజారులో పెద్దపనేమీలేదు; పాత బంగారపువస్తువ ఒకటి మార్చేసి కొత్తఫాషను దొకటి కొనడం; అంటే అన్నివిధాలయిన నష్టమూ చేతకూలీ పెట్టుకోడమన్నమాట - ఏంచేస్తాం, అందులో ఇది అమ్మాయికి సం[illegible] వ్యవహారము - ఫాషను గురించిగాని, [illegible]వసరం డబ్బు దండుగను గురించిగాని ఏమీ మాట్లాడ్డానికి వీల్లేదు. అక్కడ పని త్వరగానే అయిపోయింది.

ఇక వాచీ ఒకటి కొనవలసి ఉంది; ఇది పెళ్లిలోనే ఇచ్చిఉండవలసింది; కాని, అప్పుడు వాళ్లు సైకిలు కావాలన్నారు. ఇప్పుడు పండగకి తీసుకొని వచ్చేటప్పుడు ఉంగరం ఎంతఎత్తుది, ఎటువంటిది ఇవ్వాలని మాలో మేము తర్జనభర్జన పడుతూ ఉండగా అమ్మాయి అంది "ఉంగరం ఎందుకు, వాచీ అయితే బాగుంటుంది; అప్పుడు పెళ్ళిలో పెట్టుకొన్నది వాళ్ల స్నేహితుల దెవరిదోనట - నాతో రెండు మూడుమార్లన్నారు; వాచీ లేకపోవడం ఇబ్బందిగా ఉందని" వాచీ కొనడం విషయంలో ఏరకంది, ఏకంపెనీది కొనడమో నాకు సంపూర్ణంగా స్వాతంత్ర్యంఇస్తూ మా ఆవిడ 'నూరురూపాయిలకంటె ఎక్కువ మాత్రం పెట్టకండి' అని ఒక నిబంధన పెట్టింది. నేను సరేనన్నాను.

వాచీకొనడం నేననుకొన్నంతసులభంగా తెమలలేదు. గోల్డుగోల్డుది కొనడమా, స్టెయిన్‌లెస్ స్టీలుదికొనడమా, గుండ్రనిదా, దీర్ఘచతురస్రాకారపుదా? సాదా డయలా? రేడియమ్‌డయలా? ఈసందేహాలిలాఉండగా-కొత్తకంటికినచ్చినవాటి ఖరీగులు నూటనలభై యాభై అలా ఉంటున్నాయి. ఇంత చేసికొంటే అతగాడికి నచ్చుతుందో నచ్చదో? ఇంతకంటె పండక్కివచ్చినప్పుడు ఆ నూరురూపాయిలూ అతనిచేతికే ఇచ్చి, ఉదయం బస్సులోవచ్చి వాచీ కొనుక్కుని, సాయంత్రానికి వచ్చెయ్యమంటే నయమేమోననిపించింది. కాని, ఒక వాచీ కొనడానికికూడా మనకి ఇంతిసందేహమయితే మరెందుకనిపించింది. అంతేకాదు, నాకు కూడా వాచీలేదు. చిన్నతనంలో వాచీ కావాలని చాలా సరదాగా ఉండేది. అది మరి తీరనేలేదు. అంటే కొనుక్కొందికి తగినశక్తివచ్చినతరవాత ఆదృష్టే కలగలేదు. ఇదీ బాగానే ఉంది. మనకి నచ్చింది కొని తీసుకొని వెళ్ళడం; తనకి ఇష్టపడితే అదే ఉంచుకోమనడం; లేదంటే మరొకటి కొనుక్కోమనడం. ఈ రకమయిన నిశ్చయానికి వచ్చినతరవాత ఎంపిక అట్టే కష్టంకాలేదు. గుండ్రనిది, మరీ చిన్నసైజు కానిది, నూటనలభై రూపాయిలకు తీసుకొన్నాను. ఇంకా బస్సుకి చాలా వేళుందికదా అని, కాఫీహోటలుకికూడావెళ్ళి బస్సుస్టేండు చేరుకొన్నాను. అప్పటికింకా నాలుగున్నరే అయింది.

న్యాయంగా బస్సు ఉండవలసిందే. కాని ఆరోజున రెండవ బస్సు మరమ్మత్తులో ఉండడంవల లేదట. మొదటి బస్సు అంతకు ఒక పదినిమిషాలకు ముందే వెళ్ళిపోయిందిట. కాఫీహోటలుకి వెళ్ళి ఉండకపోయినా అంది ఉండును అనుకొన్నాను. కాని ఏం లాభం; వెళ్ళకపోయి ఉండడ మెలాగు?.. మరి బస్సు లేదు; రాత్రి ఒంటిగంటకిగాని రైలు లేదు. అంతవరకు ఏం చెయ్యడం? నిర్మొగమాటంగా ఇళ్ళకు వెళ్ళవలసిన మిత్రులిద్దరూ వేరేఊళ్లకు వెళ్లిపోయేరు. బంధువుల ఇళ్లకి వెళ్తే పెళ్లిమాటలకి వచ్చేమనుకొంటారు. అంతకంటె రయిలు వేళదాకా, ఎలాగో కాలం గడపడం మేలు.

చాలారోజులయింది సినిమా చూడలేదు. అయితే సినీమా మొదటి ఆట అయినతరవాత భోంచెయ్యాలంటే హోటళ్లు మూసి ఉంటాయి. అంతకుముందు ఆరుగంటలలోగా భోంచెయ్యడం నా తత్వానికి పడదు. అంతకంటె ఇక్కడ పార్కులో బెంచీమీద కూర్చుని వచ్చిపోయే మనుష్యులని చూస్తూ, పబ్లికు రేడియో అందిచ్చే సమాచారాన్ని ఆకర్ణిస్తూ, సంగీతాన్ని ఆస్వాదిస్తూ, కాదు అనుభవిస్తూ; ఒకొక్కప్పుడు రేడియో సంగీతాన్ని కష్టపడి అనుభవించవలసిందే, కర్మానుభవంలాగ. ఇంట్లో రేడియో అయితే ఇష్టంలేకపోతే ఆపెయ్యవచ్చును, కాని పబ్లిక్ రేడియో గాన రసాన్ని ఆస్వాదించి తీరవలసిందే, ఆరుచి మన కెంతమాత్రం ఇష్టపడకపోయినాను.

కేవలం వచ్చేపోయే మనుష్యుల పరిశీలన మీదా, రేడియోమీదా ఆధారపడితే లాభంలేదని, గంట స్తంభందగ్గరకు వెళ్ళి నాలుగు కిళ్లీలు, ఒక సిగరెట్టు పెట్టె, మూడు పత్రికలు, వాటిలో ఒకటి కేవలం సినిమా విషయాలకి సంబంధించినదికూడా-కొనుక్కొనిపోయి కూర్చున్నాను, పార్కు బెంచీమీద—

కొన్న రెండు పత్రికలలోనూ ఒకదానిలో నరసింగరావుది, రెండవదానిలో సుబ్రహ్మణ్యంది కథలున్నాయి. రెండింటిలోనూ ఉండడం చాలా విశేషంగా అనిపించింది. అసలివాళబస్సు తప్పిపోవడం కూడా ఇందు నిమిత్తమే అయిందా అన్నంతలా కూడా అనిపించకపోలేదు - ఏమంటే ఇంటిదగ్గర అయితే అంతగా చదవాలనిపించదు. పిల్లలెవళ్ళో చదివి ఇందులో నరసింగరావుగారి కథ ఉంది నాన్న



బహిష్టు
ఆగినదా? కలవరము వద్దు! "కుమారి మాత్రలు" ఎంతకాలంనుంచి ఏ కారణమువల్లనైనా నిలిచిపోయిన బహిష్టును త్వరలో జారీచేయును. నిరపాయకరమైనది.
వెల: Normal రు 3/- Special రు 5/-
Extra Special రు 8/-
(V. P. P. ప్రత్యేకము)
Mrs. P Devee F D S, Calcutta 40.
ఈ క్రిందిచోట దొరకును.
INDO MEDICAL SUPPLIES
29 Vaidyanatha Mudali Street, G. T Madras.

అంటారు. వాళ్ళే తమలో తాము చర్చించుకుంటారు. వాళ్ళకీ మరి నాన్నగారు రాయలేదుగాని, రాసిఉంటే చాలా మంచి కథలు రాసిఉందురనే ఆశఉంది. నేను నా ఆఖరికథ రాసి పదేళ్ళకు పైగా అయింది. ఆతర్వాత కొన్నాళ్ళపాటు మిత్రులు తాము ఏమేమి రాసిందీ, ఎక్కడెక్కడ ప్రచురణ జరిగిందీ తెలియజేస్తూ ఉండే వారు; నాబద్ధకంమూలంగా మరి వారికీ ఆశ్రద్ధతగ్గిపోయింది. అవునుమరి, ఉత్సాహం అన్నది రెండుప్రక్కలాఉంటేనే నిలబడుతుంది. అయినా ఏదయినా పుస్తకం అచ్చువేయించినప్పుడుమాత్రం వెంటనే పంపిస్తున్నారు. నేను ఏ కొంత తృప్తికరంగా నా అభిప్రాయాన్ని రాసినా మిక్కిలి సంతోషిస్తున్నారు. ఇవాళ నిజంగా కథలు చదవడానికి చాలా అనువయినసమయం. అందులోనూ నరసింగరావు కథ 'సాక్షిలేని కేసు' - నేనూ ఈరో జక్కడికి సాక్ష్యం చెప్పడానికేవచ్చేను. సాక్షులు - సాక్ష్యం.

ఉదయంనించీ పరధ్యానంగా ఉన్నప్పుడల్లా చిన్నప్పుడు గీరతంలో చదివినపద్యం, "ఇంజరంబొకసాక్షి ఏనాముదాసాక్షి పల్లె పాలేము దాసెల్లసాక్షి" జ్ఞాపకం వస్తూనే ఉంది. ఇందాకొ బస్సు తప్పిపోయిందనగానే నా పరిస్థితికికూడా చాలా సాక్షులు గోచరించారు - బస్సు స్టేండొకసాక్షి, పార్కుబెంచీసాక్షి, పబ్లికురేడియో పాటసాక్షి, మలబారుకాఫీహోటలు ప్రొప్రయిటరొకసాక్షి, కిల్లీషాపు స్వామిసాక్షి, బంగారు వెండి వ్యాపారస్థుడొకసాక్షి, పాచినమిస్త్రన స్టోర్సువాడుసాక్షి. ఇలా పద్యం పెరిగిపోసాగింది. తీరా కథ చదవడం ప్రారంభం కానేలేదు. ఇది పద్ధతికాదని పత్రికమూసి, సిగరెట్టు పూర్తిచేసి, మరొకటి ముట్టించి, ఇంకొకకిల్లీ వేసుకొని, శ్రద్ధగా కథ చదవడం ప్రారంభించాను.

మొదలుపెట్టేవరకే మనప్రయత్నం. తరవాతకథ దానంతటదే లాగుకొని పోసాగింది. నరసింగరావు వెనుకటి కథలలాగ మనస్తత్వ విశదీకరణతో నిండి కాక, కథ చాలా చురుకుగా సంభాషణరూపంగా నడిచిపోసాగింది.

కథ చివరిభాగం చదువుతున్నాను. చాలా రసవంతంగా ఉంది. చేతిలో సిగరెట్టు పారేసి, ఆఖరికాలమ్ చదువుతూ ఉండగా అతి సమీపంలో "నమస్కారమండీ నరసింహంపంతులుగారు!" అన్న పలకరింపు వినవచ్చింది. అతను నా పక్కనే బెంచీమీద కూర్చొని ఉన్నాడు.

'కథ చదువుతూ ఉండగా ఎవరో వచ్చి బెంచీమీద అవతలి చివరకు కూర్చోవడం తెలియకపోలేదుగాని, అంతకంటె దృష్టి పెట్టలేదు. కథలోని తన్మయత్వమేకాదు, కళ్ళజోడు పెట్టుకొని చదువుతున్నానేమో, మనిషిమీద దృష్టి సరిగా ఆనలేదు.

పలకరింపు విన్నతరవాత, అప్రయత్నంగా నమస్కారం అంటూ పత్రిక ముడిచి, కళ్ళజోడు తీసి, పరికించి చూసేను. కాని, ఎవరో ఏమిటో సరిగా గుర్తుకు రాలేదు. కొంతమాత్రం బాగా పరిచయమయిన దానిలాగే ఉంది.

వెంటనే పోల్చలేకపోయాడని ఒప్పుకొందికి మనస్కరించలేదు. కాని ఏం చెయ్యడం! నేను బాహ్యంగా పోల్చలేక





పెర్టుసిన్ "టెష్నర్"

ఆరపై సంవత్సరములపైనుంచి అన్ని విధములయిన దగ్గులతో, కోరింత దగ్గుతోసహా, బాధపడుచున్నవారికి, పెర్టుసిన్ త్వరితముగాను, క్షేమముగాను స్వస్థత చేకూర్చినది. పెర్టుసిన్ కొనుడు!

Infa

అందరు కెమిస్టుల వద్దను లభించును

ఎటెఫా లిమిటెడ్, షాన్ లీచ్‌టెన్‌స్టెయిన్, స్విస్ కస్టమ్ అండ్ ఎకనామిక్ టెర్రిటరీ వారితో చేసుకున్న ఒడంబడిక ప్రకారము, యిండియాలో **ఇన్‌ఫా లిమిటెడ్**, పోస్టు ఆఫీసు బాక్సు నెం. 1041, బొంబాయి-1 వారిచే తయారయినది.

ILY-7 TEL

# ★ పార్కు బెంచిసాక్షి ★

పోయానని చెప్పడానికి ముందే అతను, "పంతులుగారు నన్ను పోల్చినట్టు లేదు, నేను విశ్వనాథంగారి అబ్బాయిని, నా పేరు సుందరం!"—

నేను నా మతిమరుపుకి అతను నాకంటె బాగా చిన్నవాడయినా, చాలా వినయంగా క్షమాపణ చెప్పుకొన్నాను - అతన్ని నేను ఆఖరిమారు చూసి ఏడేళ్లు పైగా అయింది; కాక, నా దృష్టికూడా ఏమిటో ఇటీవల అట్టే బాగా లేదు.

అతను నేను పోల్చుకోలేకపోడానికి ఎక్కువ సావకాశం ఉందని అంగీకరిస్తూ, నాలో మాత్రం నాటికీ నేటికీ ఏమీ మార్పు వేషంలోగాని, ఆకారంలోగాని లేకపోవడంవల్లనే తాను అల్లంత దూరంనించి గుర్తుపట్టి వచ్చానన్నాడు. వచ్చి, ఇక అయిదు నిమిషాలపాటు నేను చదువుకొంటున్నాను కదా అని మాట్లాడకుండా కూర్చున్నాడుట.


అబలసుధ

స్త్రీ కుసుమ వ్యాధులు. అకాల బహిష్టు, ఋతుబద్ధము, ఋతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ కాళ్లు లాగుట, మనస్తిమితము లేకపోవుట, విద్రిపట్టకుండుట, నడుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిస్టీరియా మొ॥ హరించును.

సీసా రు. 3/- వి. పి రు 1/-

ఇండియన్ మెడికల్ హౌస్

లక్ష్మి టాకీసు రోడ్డు విజయవాడ-2.)



## నపుంసక తైలం

అంగనరములు బలహీనతచెంది చిన్నదైన తిరిగి యథాప్రకారమై పూర్తి సౌఖ్యమును అనుభవించుటకు 48ఏండ్లు ప్రఖ్యాతి చెందిన గ్యారంటీ మందు 1 సీసా రూ. 10/-లు.

వి పి రూ 1-4-0

కావలసినవారు రు 1/4 ముందుగా పంపేది.

డా॥ రత్నం నన్సు మెడికల్ హాల్,

మలక పేటబిల్డింగ్స్, హైద్రాబాదు-(దక్షన్)



ప్రతిష్ఠమైన నంజనగూడు పండ్లపొడి వారి

అగత్యమైన కుటుంబ ఔషధములు

కాస్మస్ కస్తూరి మాత్రలు...సీసా0-8-0

కర్జక్ గోరోజన మాత్రలు... 0-8-0

బాలక్స్ జీర్ణవమగుటకు మాత్రలు... 0-6-0

మా మందుల పూర్తి జాబితాకు వ్రాయుడు

యునైటెడ్ కన్సర్న్, బందరు వీధి, మద్రాసు-1. విజయవాడ.


అతన్ని నేను గుర్తుపట్టలేకపోయినందుకు నా అశక్తిని ఎంతగా కారణం అనుకున్నా, నిజానికి లోపం అతనిలోనే ఉంది ఎక్కువగా. పూర్వం సుందర్రావు అన్న పేరుకి తగినట్టుగా ఉండేవాడు. ఇప్పుడు పేరొక్కటే మిగిలినట్టుంది.

ముతక ఖద్దరుబట్టలు — కొద్దిగా మాసిన గడ్డం - ఈ రెంటినీ సర్దుకోవడం అట్టే కష్టంలేదు. కాని, జుట్టు అక్కడక్కడ తెల్లబడుతోంది. క్రాపింగు మొగానికి అమిరినట్టులేదు. అసలు మొగంలో ఎక్కటా కళాకాంతులు లేవు; నీరసంగా, నిష్ప్రభంగా; నిరాశతో నిండిఉన్నట్లనిపించింది. మాటకూడా, ఏదో తప్పుచేసినవాడు సమాధానం చెప్పుకుంటున్నట్లుగా వినిపించింది.

అతనీ ఊళ్లో ఉన్నాడన్న విషయం నాకు తెలియకపోలేదు. కాని ఆ సంగతి ఇంతసేపూ స్ఫురించనేలేదు. వాళ్లింటికి తిన్నగా రాకపోయినందుకు అతనికి, సమాధానం చెప్పుకొనివచ్చేసరికి తలప్రాణం తోకకి వచ్చింది. కోర్టుపనే కాదు, ఇంటిదగ్గర రాత్రి వెళ్ళితీరవలసిన అర్జంటుపని ఉండడం, అంతే కాదు, ఆ సమయంలో అక్కడ పార్కులో కొందరిని కలుసుకోవలసి ఉండడం మొదలయిన ఏవేవో కారణాలు చెప్పుకొన్నాను. నేను నమ్మించడానికి ప్రయత్నిస్తున్నకొద్దీ అతని అపనమ్మకం ఎక్కువవుతుంది.

చివరికి అతను అప్రయత్నంగా 'మీరు మా యింటికి ఎందుకు వస్తారులెండి' అనేసి అన్నందుకు కొంచం నొచ్చుకొన్నట్టున్నాడు.

నిజానికి అతను స్కూలుమాష్టరుపని చేస్తున్నాడో, బేంకుగుమాస్తాపని చేస్తున్నాడో, ప్రెస్సాఫీసులో పనిచేస్తున్నాడో నాకు గుర్తులేదు. అతను ఇన్ని మాటలు అంటున్నాడు గాని, ఆ వైనం ఏమీ తెలియజెయ్యలేదు.

నాకు మరి ఈ ధోరణి అట్టే సేపు సాగడం ఇష్టంలేకపోయింది. సూటిగా ప్రశ్న వేసేను.

"ఏమోయి; సుందరం! నీ వయసింకా ముప్ఫై అయినా దాటలేదనుకొంటాను. మీ మలా నీరసంగా ఉన్నట్టున్నావు; ఒంట్లో గాని బాగాలేదా?"

అతను కోపం తెచ్చుకొంటాడేమో నని అనుమానపడుతూ- నేను వేసిన ప్రశ్న అతనికి చాలా తృప్తి కలిగించినట్టుంది ఇంతసేపటికి అడగవలసినప్రశ్న అడిగారన్న ధోరణిలో మొదలుపెట్టాడు. నరముల బలహీనత, తరుచు తలనొప్పి, అజీర్ణమూ, ఇంకా ఏమేమో చెప్పుకుపోసాగాడు; హాస్పిటలు, డాక్టర్లు, వాళ్లు పెద్దపెద్దజీతాలు పుచ్చుకొంటూకూడా సామాన్యరోగుల యెడలచూపే అనాదరమూ ఒక్క హాస్పిటల్లోనే కాదు, ప్రజాహితసంస్థలలో పనిచేసే వారికి సర్వసాధారణమయిన అశ్రద్ధ, దంభము, స్వలాభపరాయణత్వము, ధనికులంటే పక్షపాతమూ.. ఇక ఆ ధోరణికి అంతు లేదనిపించింది. సరిగా విశ్వనాథంధోరణే పట్టుబడింది. కాని, వాడికి ప్రతిసామాన్య విషయాన్ని వివాదవిషయంగా మార్చేపద్ధతి ఉండేది. ఎవరేదన్నా దానిని కాదని, అంతకంటె మరేదో చాలా ఘనమయినదని అంటూ, ఎగురు ప్రశ్నలు వేసేవాడు. నలుగురుచేరినచోట, మరెవ్వరూ ఏదీ సరదాగా మాట్లాడుకొందికి వీల్లేకపోయేది విశ్వనాథం ఉంటే వాడిమీద వ్యక్తిగతంగా ఎంత అభిమానంఉన్న వాళ్లకయినా వాడి ఈ వివాదాలు పెంచే తీరు నచ్చేది కాదు. అయినా వాడిలో ఏదో స్నేహితులను ఆకర్షించే గుణం ఉండేది. ఇతనికి ఆశక్తికూడా ఉన్నట్టులేదు. అంచేతనే అన్నిమాటలూ తనలో తానను కోడమే అలవాటయినట్టుంది. కీయిచ్చినబొమ్మలు, కొంతసేపటివరకు ఎలా గంతులు వేస్తాయో అలాగ ఇతనిధోరణి సాగిపోయేట్టుంది

కొంతసేపు విన్నతరవాత నేను అతని మాటలను శ్రద్ధగా వినలేకపోయాను. అతను చెప్పిచెప్పి ఎప్పుడు ఆగిపోయాడో కూడా గుర్తించలేదు - పెద్ద గొడవచేస్తున్న [illegible] అకస్మాత్తుగా ఆగిపోయినట్లయింది. అయినా నేను అతను చిట్టచివర చెప్పిన మాటను వినలేదు, మరి ప్రసంగం తప్పిస్తేగాని లాభం లేదని, "అబ్బాయి, సుందరం! నీకేమయినా పిల్లలా?" అన్నాను.

పోయిన ఒక ఆడపిల్లకాక, ఇద్దరు కొడుకులూ ముగ్గురు ఆడపిల్లలూ, ఇక, వాళ్ళను గురించి తను పడిన యాతనలూ, వాళ్ళ బల్లజబ్బులూ, పాలడబ్బాల ఖర్చులూ, మందులఖర్చులూ, వాళ్లఅత్తవారుకూడా తక్కిన ఆడపిల్లలకు చేసినట్టి సాయ్యకపోవడమూ, తనకూ తండ్రికీ నాడు వచ్చిన తగాదా నేటివరకూ అల్లాగే ఉండడమూ, తాను ఎంతట అవస్థపడుతూ అయినా సరే తండ్రి సహాయాన్ని అర్థించక పోడంలోని ధీరత్వమూ, తండ్రి ఎవరిద్వారానో కబురుకూడా చేసేడట; తను స్వయంగా వెళ్లి కావాలంటే సహాయం చేస్తానని; అతనికి సహాయం చెయ్యాలని ఉంది; ఇతనికి చేయించుకోవాలని ఉంది; కాని, ఇద్దరికీ వదలాలిన అహంభావం; నేనెంగుకు తన దగ్గరికి వెళ్తాను, తనకంత బాధగా ఉంటే రమ్మను - ఇదీ ఇద్దరి మొండి పట్టుదలాను.

అసలీ పట్టుదల లెందుకు వచ్చేయంటే, విశ్వనాథం మామూలుగా అందరిలాగే కొడుక్కి సంబంధం నిశ్చయపరచుకొని వచ్చాడు. పిల్ల చాలా అందంగా ఉంటుంది, చదువుకొంటూంది; బాగా పేరుప్రతిష్ఠలుగల కుటుంబం; వాళ్ళకి ఆఖరు పిల్ల కావడంవల్ల, అదివరకు అందరు పిల్లలకూ ఇచ్చినట్టే కట్నకానుకలిచ్చి పెళ్ళి జరిపిస్తారు; ఇటువంటి సావకాశాలన్నీ ఉన్న సంబంధాన్ని విశ్వనాథం కుదుర్చుకొనివస్తే, సుందర్రావు తానేమో ఒక స్నేహితుని చెల్లెలిని ప్రేమించాననీ ఆమెను తప్ప ఎవ్వరినీ చేసుకోననీ, తన ప్రేమ విఫలమయితే తనకు చావుతప్ప గత్యంతరం లేదనీ గొడవపెట్టేడు. విశ్వనాథం స్పష్టంగా చెప్పేసేడు. “నీ యిష్టంవచ్చినట్టు అఘోరించు; ప్రేమించినవాడివి పెళ్ళి చేసుకోవడం మాత్రం తెలీదా? నన్ను మరి సలహాలూ అడగవద్దు; నా సహాయం గురించీ ఆశించవద్దు” అన్నాడు - నాటినుండి నేటి వరకు ఆ పట్టుదలలు అలాగే ఉన్నాయన్నమాట...

కొంచెంసేపు ఏ మాటలూ లేకుండా గడిచిపోయింది. పాపం అతని విషయంలో నేను చూపవలసినంత సానుభూతి చూపలేకపోతున్నానేమో అనిపించింది. కాని, ఏమిటో ప్రపంచం అంతా తనను ఇబ్బందులు పెట్టడానికే చూస్తున్నదన్న ధోరణి నచ్చకుండా ఉంది

పోనీ, అతనికీ నాకూ సంబంధించని ఏదో ధోరణిలో అడుగుతే ఎలాగుంటుందో, అతనికి కొంత తృప్తిగా ఉండవచ్చునని, “గాడు సంవత్సరం అప్పుడు మాతోపాటు మా యింటికి వస్తూఉండేవాడు హయగ్రీవరావుగారని, అతను ఈ ఊళ్ళోనే ఉంటున్నాడని ఎవరో అనగా విన్నాను; ఎక్కడున్నాడో, (నిజంగా నా కతనితో ఏమీ పనిఉన్నట్టు!) నీకుగాని తెలుసునా?”

“బాగుంది, తెలియకపోవడం ఏమిటి? ఆయన మా పొరుగునేకదూ ఉండటం. పోనీ, ఆయన్ని చూడ్డంకోసమయినా మీరు మా యింటికి రావాలి”

“ఎందుకు రానోయి? ఇప్పుడేదో పని తొందర ఉండిగాని, లేకపోతే నువ్విన్ని మార్లు చెప్పాలా? సరేగాని, హయగ్రీవరావు మాకంటె ఒక దశ పెద్దవాడే; ఇప్పుడెలా గున్నాడు? ఏమిటి సంగతి?”

“ఆయన కేమిటండీ, మహారాజులా గున్నాడు.”

“ఏమిటలా అన్నావు? ఇప్పుడు మహారాజుల పని ఏమీ బాగా ఉండడం లేదని అనుకొంటున్నారే అందరూ, నువ్వుగాని వ్యతిరేకార్థంగా అనలేదుకదా?”

“అలాంటి అర్థమేమీ లేదండీ, నిజంగా ఈ ప్రపంచంలో ఎవడయినా నిశ్చింతగా, హాయిగా జీవితం వెళ్ళబుచ్చుతున్నవాడున్నాడంటే అతనే నంటాను. ఇంట్లో ఏ బాదరబందీ, జంఝాటమూ లేదు. హోటలునుండి భోజనం వస్తుంది; ఉన్న రెండిళ్ళలో చిన్న దాంట్లో తనుంటున్నాడు; రెండవది ఒక కంపెనీకి అద్దెకిచ్చాడు. వాళ్ళు ఒకటవ తేదీ సాయంకాలానికల్లా, పువ్వుల్లో పెట్టి అద్దె పంపిస్తారు; ఇంకా, ఈ ఇనాందారీ బిల్లు పాసవడక ముందే ఆ భూమికూడా మంచి క్రయానికే అమ్మేసి బేంకులో ఫిక్సెడు డిపాజిట్ వేశాడు. దాని మీద బోలెడువడ్డీ వస్తుంది”.

“అయితే బాగానేఉందన్నమాట వాడి పని. ఆమధ్యను ఆరేడేళ్ళ క్రితం వాడిభార్య పోయింది. తరవాత తన సంరక్షణకి ఎవర్ని చెప్పుకోవడంచేతా హోటలు మెతుకులు తింటున్నాడన్నమాట, పాపం.”

“పాపం ఏమిటండీ, ఆయన ఈజీవితంలో ఏమయినా నిజమయిన శాంతి సౌఖ్యమూ అనుభవిస్తున్నాడంటే, అది ఈ సమయంలోనే అతనికి తగినవాడే ఎవ్వరూ నా అనేవారు లేనిఆఖరు ఒకడు దొరికేడు, రామస్వామి అని - పెద్దమీసాలు వాడున్ను నిజంగా వాడుచేసినసేవ ఏభార్య చెయ్యగలదండి?”

“పోనీ అదయినా కొంత నయం. అప్పుడే వాడు పెద్ద దృఢమయినమనిషి కాడు; ఇప్పుడు ఆరోగ్యం బాగుందా?”

“బాగుందా అని అడుగుతారు ఉక్కు పిడుగులాగు మనిషంటే ...అసలు నేననేది కేవలం డబ్బుగురించికాదు, ఇప్పుడు మా నాన్న ఉన్నాడు, మరొకరున్నారు, మరొక


ఒక వాచి వాటర్‌ప్రూఫ్‌దై ఎందుకు ఉండాలి?



మొదటి చూపులో వాటర్‌ప్రూఫ్ వాచీకి ఏ మామూలు వాచీకన్న ఒకే ఒక అనుకూలము ఎక్కువ కనపడుతుంది —మీరు దానిని చేతికి ఉంచుకొనే యీదవచ్చును అనేదే.

కాని విషయము ఇంతమాత్రమే కాదు శాశ్వతముగ వాటర్‌ప్రూఫ్ అయిన రోలెక్స్ ఆయిస్టర్ — ఇది ప్రపంచములో మొట్టమొదటి వాటర్‌ప్రూఫ్ వాచీ అగుటయేకాక యింకా మొదటిదిగానే యున్నది—నీళ్లలోనికి పోవుట ఆపుట మాత్రమేకాక యింకా ఎక్కువే చేస్తుంది

దుమ్ము, మలినము, ధూళి మరియు చెమటవంటి వాచీ సరియైన నడకకు ప్రతిబంధకమైన వస్తువులనుకూడ లోనికి ప్రవేశించకుండా అడ్డును. జెనీవా గడియార నిపుణుల హస్తకౌశల్యముతో తయారై సీలుచేయబడిన ఆయిస్టర్ కేసు, గడియారపు యంత్రమును ప్రతి రోజు 432000 పార్లు (ఎక్కువ కాకుండా తక్కువ కాకుండా) టిక్కుటిక్కు అనేటట్టు తప్పులేకుండా నడచుటలో సహకరించును.

మా వద్దనున్న అన్ని రకముల రోలెక్స్ ఆయిస్టర్ వాచిలను చూడండి రోలెక్స్ ఆయిస్టర్ డేట్ సహా ఈ వాచీ డయలు మీద చిన్న, చక్కని కిటికిలో తనంతట తానే స్పష్టముగ తారీఖు చూపును. మీకు రావడానికి వీలు లేకపోతే మేము ఉచితమైన క్యాటలాగు పంపుతాము.

రోలెక్స్

దక్షిణ ఇండియాలో ఏకైక డిస్ట్రిబ్యూటరు:

మెస్సర్స్ పి ఆర్ అండ్ సన్స్ లిమిటెడ్,

మౌంట్ రోడ్, మద్రాసు

R 737

# ★ పార్కు బెంచీసాక్షి ★

ఉన్నారు - ఇతనికంటె బాగా ఎన్నో ఇంతలు డబ్బున్నవాళ్లు - కాని, వాళ్లంతా యీయన పొందగలగినంతహాయిని పొందు తున్నారా అని-అంతహాయిగా, స్వేచ్ఛగా, ఎటువంటిగల్లంతూలేని గడియారంలా సాగి పోయే నిత్యకృత్యం ఎందరికి సాధ్యమవు తుంది? ఆయననుచూసి ఎవరయినా అసూయ పడవచ్చును."

నాకు మళ్లీ ప్రసంగంమార్చాలనిపించింది. సినీమాలగురించి మొదలుపెట్టేను. వాటి మీదకూడా ఏదో ఫిర్యాదు ఉన్నదన్నట్టు గానే మాట్లాడసాగాడు సినీమాలు విజ్ఞాన ప్రదంగా లేకపోవడం, కేవలం డబ్బుచేసు కోడమే పరమార్థంగా తయారవడం, చవక బారు హాస్యము సెక్సు ఆకర్షణలూ కలిగి ఉండడమూ, మేకప్పులనేవి మేను కప్పక పోయేందుకే వినియోగించబడడమూ, .. ఇవన్నీ మామూలుగా అందరూ సినీమాల మీద చేసే ఆరోపణలే కాని, అతని ముఖతః వచ్చేసరికి మాత్రం ఏదో అతనికి అన్యాయం జరిగిపోయిందని ఫిర్యాదు చేస్తున్న ధోరణి కనిపించింది...

తరవాత నేను కావాలనే రాజకీయాల గురించి కూడా కదిపిచూసేను. వాటిల్లోనూ ఇంతే. అతనికి వేటిలోనూ సామాన్య మాన వుడికి తెలియవలసినపాటి తెలియక కాదు, బాగానే తెలుసును, కాని మొత్తంమీద అతని స్థాయీభావము - కొన్ని చాలా దురన్యాయంగా ఉన్నాయి, మరికొన్ని చాలా అసూయ కలిగించేవిగా ఉన్నాయి, సరిఅయిన అవకాశాలే గాని ఉంటేనా? (ఆ ఉంటేనా అన్నది తనకూ తనవంటి మరికొందరికీ వర్తిస్తుందన్నమాట—)

అలా మాట్లాడుతూ మాట్లాడుతూ తక్కున ఏదో అంతసేపూ మరిచిపోయి జ్ఞాపకం వచ్చినవాడిలాగ "మరి నేను వెళ్లా లండీ, నమస్కారమూ సెలవు, ఈమారు మీరు వచ్చినప్పుడు తిన్నగా మాయింటికే వచ్చెయ్యాలి" అన్నాడు. నేనూతప్పకుండా అలాగే వస్తానన్నాను—గాని, అతని ఇల్లు ఎక్కడ ఏ వీధిలోనో అతను చెప్పలేదు; నేను అడగలేదు. నాకు నిజంగా అతని ఇంటికి వెళ్ళకపోవాలని ఏమీ లేదు, గాని, వెళ్ళవలసిన అవసరం కనబడలేదంతే - ఈమారుగాని రావడం తటస్థిస్తే, అతని ఇల్లు వెతుక్కొంటూ వెళ్లి, "మానేవా అవేళ అంతసేపు మాట్లాడికూడా ఇంటిని గురించి నేను అడగలేదు, నువ్వు చెప్పనూ లేదు" అందామనిపించింది. అంతే కాదు, అప్పుడే ఒక కథ చదవడంవల్లనూ, అలవా టయిన పరిసరాలను దాటి కొత్తచోట, ఎప్పుడో తెలిసిన మనిషిని అనుకోకుండా కలియడమూ నాలోని రచయితృలక్షణాన్ని మేల్కొలిపి ఉంటుంది.. ఇతని ధోరణి ఎక్కడో కలిసిన నాతోనే ఇలాగుందికదా, ఇంట్లో ఎలాగుంటుందో, ఆ అమ్మాయి ఈతనితో ఎలా వేగుతూందో, అతనిమాటల ధోరణినిబట్టి చూస్తే ఇంటి వాతావరణంలో సంతోషంకంటె విసుగుదల, సౌఖ్యంకంటె బాధపడిపోతున్నాననే భావమూ ఎక్కు వగా ఉన్నట్టుంది. ఉండవచ్చును, నిజమే తక్కువ రాబడి, అయిదుగురు పిల్లలు, అందులో వాళ్లు సహజంగా అనారోగ్య వంతులయితే మరి చేసేదేముంది. ఏమయినా అతని పరిస్థితిని కొంత తెలుసుకోవాలి. నిజంగా డబ్బు లేక ఇబ్బంది పడుతూంటే, వాళ్ల తండ్రికి కొస్త గట్టిగా రాసి చూడాలి. వాడూ తన కుండేలికి ఒక కాలు కోసేసి సిద్ధంగా ఉంటాడు......

పగటి వెలుగు బాగా తగ్గిపోయింది. పార్కులోని ఎలక్ట్రిక్ దీపాల వెలుగువల్ల ఉన్న కొంచము తెలియడంలేదు నేనున్న బెంచీకి సమీపంలో దీపం లేకపోవడంవల్ల మరి చదివే ప్రయత్నం లాభంలేదు. కాదంటే, అక్కడి కెక్కడికోపోయి, బెంచీలన్నీ నిండిపోయేయి, గడ్డిమీద కూర్చొని చదవాలి. అంటె ఈ బెంచీ విడిచిపెట్టాలి. ఎంతమాత్రం మనస్కరించ లేదు - ఆ కొద్దిసేపటిలోనే దానిమీద ఏదో మమకారం పొడమింది కాళ్లు మరి కాస్త జాపుకొని చేరగిలబడి కూర్చొని, పెద్ద ధ్వనితో వస్తున్న వాద్య సంగీతాన్ని ఆస్వాదిద్దాము శ్రద్ధగా అనుకుంటూ ఉండగా, నా బెంచీలోని అర్థసింహాస నాన్ని దురన్యాయంగా ఆక్రమించు కొందామన్న దురుద్దేశంతో తొందరగా నడుచుకొంటూ రాసాగాడు ఒక వెయిస్టు కోటు, చేతికర్ర, చెవులకి మఫ్లరు జంటి ల్మను.

నా సింహాసనంలోని సగభాగాన్ని అత నింకా కొంచెం దూరంలో ఉండగానే అతను అడక్కుండానే నిర్మోహంగా ధారాదత్తంచేసి, పక్కకి మొగం తిప్పుకొని కూర్చుంటూ, కుతూహలం ఉండబట్టక సమీపించే ఆకార విశేషాన్ని మరోకమారు సపరిశీలనగా చూసేను - ఈమారు పోల్చు కోక పోలేదుగాని, చాలా కష్టమే అయింది, అయినా ఈమారు తప్పుచేయనందుకు నన్ను నేను అభినందించుకోకపోలేదు - మరెవరూ కాడితను, ఇంతసేపూ మేము ఎవరిగురించి అయితే మాట్లాడేమో ఆ హాయ గ్రీవరావ్ ఇతను - వేషంలో వెనకటి పద్ధతి ఏమీ లేదు. అంతేకాదు, సుందర్రావు చెప్పిన మాటలమూలంగా నాలో భావన వలన ఉద్భవించిన ఆకృతికీ దీనికీ ఏమీ పోలిక లేదు. చూడటానికి అంత బలహీ నంగా ఉన్నట్టులేడు గాని, బలంగా మాత్రంలేడు; ఇతనిని సుందర్రావు ఉక్కు పిడుగులా గున్నాడన్నాడు; పాపం అతని కలా అనిపించి ఉంటుంది. ముప్ఫైఏళ్లకే ముసలివాడులాగా అయిపోయాడు మరి—

హాయగ్రీవరావుగారు చిత్రమయిన మనిషి - అతన్ని ఏదైనా ప్రశ్న అడిగే మంటే వెంటనే సమాధానం చెప్పడు. అతని ధోరణిచూస్తే మన ప్రశ్న వినిపించిందా లేదా అని అనిపిస్తుంది. కాని, కొంచెం సేపు ఊరుకొని, "...కాదూ అడిగేరు?"





సర్వ గర్భాశయ వ్యాధులను
పూర్తిగా పోగొట్టి ఆరోగ్యమగు
సంతానమును కలుగజేయును.
అన్నిచోట్లదొరకును సీసా 2/8

కృష్ణాలేబరేటరీ, బెజవాడ

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధు లకు గ్యారంటీ చికిత్స. క్యాటలాగు ఉచితము.
వలసినవారు జి. వి. రెడ్డి & కో. (రిజిష్టర్డు)
"భాస్కరాశ్రమము"
గోపాలపురం తూర్పుగోదావరి.

అంటూ తన సమాధానం మొదలుపెడతాడు, ఏమైనా ఎక్కువగా మాట్లాడే రకం కాదు- ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టే ఉంటాడు. లోగడ ఒకప్పుడు అనుమానం వచ్చి అడిగాను కూడా - ఆయన అన్నే, ఏమీ ఆలోచించడం లేదండి! అవతలివాళ్లు ఏదైనా మాట్లాడుతూ ఉంటే గొడవపెట్టకుండా శ్రద్ధగా వినడం నా మతం - ఆ శ్రద్ధగా వినడమన్న దానికి అర్థం బహుశః అవతలివారిమాట అయిపోయిన రెండు నిమిషాల వరకు విన్నాడో లేదో తెలియబడకుండా కూర్చోడం కాబోలు!

ఈ అవలక్షణానికితోడు ఇటీవల కొంచెం చెముడుకూడా వచ్చినట్టుంది - బిగ్గరగా మాట్లాడాలి, అదీ పబ్లికుపార్కులో కొంచెం మొగమాటంగా నేఉంటుంది, కాని తప్పదు- బిగ్గరగా మాట్లాడ్డమనేసరికి అనుకోకుండానే చేతులుకూడా కదలడం మొదలుపెడతాయి.

"అయితే మీ ఆరోగ్యం బాగానే ఉంది కదూ" - అతను అలవాటుప్రకారం కొంచెం సేపు ఊరుకొని, "నా ఆరోగ్యంమాటకదూ అడిగేరు; అంతా పొట్లపండులాగుంది. ఏ క్షణానయినా పగిలిపోవచ్చు - అయితే నేనూ సిద్ధంగానేఉన్నానులెండి. అన్ని ఏర్పాట్లూ చేసేసిఉంచేను. అసలు నిజం చెప్పాలంటే ఆ గొల్లవాడెవడో అన్నాడు, ఆ ఉరేదో వేగంతీసేస్తే పోయి నామందని చూసుకోవాలని. అలాఉంది. ఎంతకాలమని ఈ ఎదురుమాడ్డం. ఇదేదో వేగం తెమిలిపోతే మంచిది."

నాకు చాలా కష్టమనిపించింది. "మీరు చాలా దృఢంగాఉన్నారని ఎవరో అన్నారండీ ఈమధ్యనే" - అతనిపొరుగునే ఉన్న యువకుడే ఆమాటన్నాడనడానికి మనస్కరించలేదు.

"నేను చాలాదృఢంగా ఉన్నానని అన్నారా? చూస్తున్నారు, మీకు కనబడలేదా? బైటికి ఒకమాదిరిగా బాగానే ఉన్నట్టుంటుంది. అదీ ఎంతటి ఆహారవిహార నియమాలఫలితంగా! అసలు రక్తపుపోటుంది. ఎంతోకాలం లేదని తెలుసును. కాని, అంతవరకు ఈ నిరీక్షణమనేది చాలా చికాగ్గా ఉంది"

"మీరలా ఎందు కనుకోవాలి? ఇప్పుడు ఆర్థికమయిన ఇబ్బందులేవీ లేవు—ఏదో మంచాన పారవేసే దీర్ఘవ్యాధితో తీసుకోనేకంటె గుండెకి సంబంధించిన జబ్బు చాలా మంచిది; త్వరలో తీసుకొనిపోతుంది. మీ యీ జీవితాన్ని దేనికోసమో ఎదురుచూడడం అనేకంటె, ప్రశాంత గంభీరమయిన నదీగమనంలాగుందనుకోకూడదా?"

"మీకింకా చిన్నతనపు కవిత్వవాసన పోయినట్టు లేదు నా డబ్బు అందరికీ కావాలి గాని, నేను మాత్రం ఎవ్వరికీ అక్కరలేదు; నా ప్రేమ కంటకప్రాయంగా ఉంటుంది."

"ఇదంతా మీ భ్రాంతిమాత్రమే నేమో?"

..."ఏమిటన్నారు, భ్రాంతా? కావచ్చును; పదిమార్లు ప్రయత్నించి చూసినా ఒకేరకపు ఫలితం వచ్చిందంటే, అది భ్రాంతి అయినా దానిని తొలగించుకొనే శక్తి మనకుండదు, అధమం నాకు లేదు— పోనీ, వర్తమానాన్ని విస్మరించి, గత కాలపు జ్ఞాపకాలతో సంతోషిద్దామన్నా అవి అన్నీ మోసం, క్రౌర్యం, కౌటిల్యంతో నిండినవే—అందికే నాదగ్గర చేరదలచిన బంధువులందరితోను స్పష్టంగా చెప్పివేశాను—"నేను బ్రతికి ఉండగా మీలో ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బందులలో ఉన్నా సరే, ఒక్క కాణీ అయినా ఇవ్వను—అందుచేత మీలో మీరు ఏమీ పోటీలు పడనక్కరలేదు - నా అనంతరం నాకున్న కొంచెం ఎవరెవరికి ఎంత చెందవలసిఉంటే అంత చెందుతుంది"

"మంచిపని చేసేరు - పీడ ఒదిలింది."

..."బాగానేఉంది, అంతమాత్రంలో ఒదిలిపోతుందా అందరూ అనుక్షణమూ నేను ఎంత వేగం చచ్చిపోతానా అని ఎదురుచూసేవాళ్ళే-వాళ్ళ ఖర్మం, వాళ్లెలా ఏడిసినా బాధలేదు, గాని ఈలోగా నా యింటికయితే రావడానికి సాహసం లేదు గాని, ఏవేవో ఉత్తరాలు - మేమింతటి విపత్తులలో ఉన్నామంటే మేమంతటి కష్టాల ననుభవిస్తూ మహత్కార్యాలు సాధిస్తున్నామని. ఇదంతా నా దృష్టిని తమపట్ల సుముఖం చేసుకొనే ప్రయత్నమని - నిజానికి, నాకు వస్తున్న ఒక్కొక్క ఉత్తరంతో వాళ్ళకు ఉండే అవకాశం కొంత జారిపోతున్నట్లు గ్రహించుకోరు - కొసకి, నాకు అనిపిస్తున్నదేమిటంటే, నేనెలాగూ వీళ్లను తృప్తిపరచలేను, ఉన్నదయినా చాలా కొంచెము. వీళ్ళలో వీళ్లకు ద్వేషాలు పెంచేకంటే, అంతా మొత్తంగా ఏదో ఒక ధర్మకార్యానికి వినియోగించాలని కాని, వీళ్లకి అది ఎంతో ఆశాభంగంగా ఉంటుంది. అందులోను నేను మరీ ఎక్కువ కాలం బతుకుతున్నకొద్దీ వాళ్ల ఆశలు మరీ నిడుపు సాగుతాయి. ఇక చెల్లెలు తన కొడుకు కాలేజీ చదువువేళకయినా, నా మూలంగా వచ్చే డబ్బు రాదా అని చూస్తుంది, మరొకతె, కూతురు పెళ్లి కట్నానికి నామీద ఆశపెట్టుకొని కూర్చుంది. ఇంకా ఉన్నారు, చాలామంది ఇటువంటి ఆశలు పెట్టుకొని, ఎదురుచూస్తున్నవాళ్లు - వాళ్లందరనూ ఎక్కువకాలం బాధపెట్టడం ఎందుకని నేనూ చూస్తున్నాను."

నేను మాటవరసకి "నిజమే" అన్నా, నాకనిపించింది. ఇదంతా ఎందువల్ల? మామూలుగా అందరిలాగ ప్రపంచంతో కలిసి మెలిసి ఉండడకపోవడంవల్లనే కదా - ఎవరో ఒకరిని తన సంరక్షణకు తెచ్చుకొని ఉంటే...ఎవడో ఒక మేనల్లుడినో, మరదలు కొడుకునో తనవాడు అనిపించుకొంటే ...ఏం మునిగిపోయింది? మొదట్లో కొంచెం ఏడిచినా తక్కిన బంధువులు కాలక్రమాన వాళ్లే ఊరుకొంటారు. తన బ్రతుక్కి ఒక ఆదర్శం, తనవద్ద ఆధారపడినవాళ్ల బాగోగుల్లో కొంత జీవచైతన్యం ఉండిఉండును- కాని, ఈ మాటలు అతనితో చెప్పి, వాదించి ఫలితం ఉండదన్న సంగతి నాకు బాగా తెలుసును. కాక, మళ్ళీ, ఈతనిని ఎంత కాలానికి ఎక్కడ కలుసుకొంటానో, అసలు కలుసుకోడమే పడదేమో, అటువంటిది ఈ కొద్దిసేపటికి వాదన ఎందుకని ఊరుకొన్నాను. అతనూ ఊరుకొన్నాడు. ఏమీ ప్రసంగం లేకపోడం ఏదో వెలితిగా తోచింది. ఇంతకాలానికి వెనుకటి రోజుల మిత్రుడు కనిపిస్తే మాట్లాడుకొండికి విషయాలే లేకపోయినందుకు సిగ్గేసింది. కాని స్వంతవిషయాలు మాట్లాడుకోడం బాగున్నట్టులేదు. ఇందాకా చేసిన పనే ఇప్పుడూ చేసేను.




కొత్తగా ప్రవేశపెట్టబడినవి

అందము, పటిష్టముగల ఉక్కు కుర్చీలు సరసమైన

వెలలో కొనుటకు మమ్ము సంప్రదించండి.

వివరములకు వెంటనే వ్రాయండి:

# లల్లూరాం అండ్ కో,

వెలగలేటివారి వీధి, : : విజయవాడ - 1.

"కొత్త షోరూమ్ - మారుతి సినిమా ఎదురుగా."

# ★ పొరుగు పెంపె సాక్షి ★

"సరేగాని చూడండి, మనవాడు విశ్వనాథం మీకు జ్ఞాపకం ఉందికదూ, తరుచు మనం వాడింటి దగ్గర కలుస్తూఉండడం, వాళ్ల పెద్దబ్బాయి - మీకు తెలుసును కదూ, సుందర్రావనీ, తండ్రితో పోట్లాడి ప్రేమవివాహం చేసుకున్నాడు, అతను ఈ ఊళ్లోనే ఉంటున్నాడట ఎక్కడఉంటున్నాడో ఏమిటో మీకుగాని ఏమయినా తెలుసునా? పాపం, చాలా డబ్బుకి ఇబ్బంది పడుతున్నాడట అంతేకాదు..."

ఈమారుమాత్రం హయగ్రీవరావు గారు మాట కాస్త తొందరగా అందుకొన్నారు. బహుశః నేను మొట్టమొదట చెప్పినమాటలే ఆలోచనని కదిలించి ఉంటాయి.


"అతను ఈఊళ్లోనే ఉన్నాడు. నాకు తెలియకేం, మాపొరుగునే ఉంటున్నాడు. కాని, అతను ఇబ్బందుల్లోఉన్నాడని మీకు ఎవరుచెప్పారో? అతనికేం, హాయిగా మహారాజులా ఉన్నాడు - "

"అలాఅంటారా? ఏమోపాపం తండ్రితో పోట్లాడి వేరెపోయాడు. కాలేజీ చదువు పూర్తికాకుండా ఉద్యోగంలో కుదురుకున్నాడు. పైగా అయిదుగురుపిల్లలట."

"అయితే ఇవన్నీ మీకు పెద్దకష్టాలుగా కనిపిస్తున్నాయన్నమాట అతను కాస్త ఎప్పుడయినా విసుగుదలా కోపమూ ఉంటే ఉన్నాయి గాని, ఆ అమ్మాయి నిజంగా శాంత అన్న పేరుకి తగిఉంటుంది. అతనే నిజంగా సుఖపడకపోతే, మరెవ్వరు సుఖపడుతున్నారో నాకర్థం కాదు. ఏదో స్థిరమయిన ఉద్యోగం ఉంది; అనుకూల దాంపత్యం—పిల్లలు కూడా చాలా తెలివయినవాళ్లు; ఎంతో అందంగా ఉంటారు"

"ఎంత అందంగా ఉంటేనేం బలహీనంగా అనారోగ్యంగా ఉన్న తరువాత—పాపం, అసలే తక్కువ జీతం, అందులో మందుమాకుల ఖర్చు లాకటి వచ్చిపడ్డాయంటే మరింక చెప్పేదేముంది."

"ఏమిటో మీకంతా తెలిసినట్లు మాట్లాడుతున్నారే. అతను అతి జాగ్రత్తకొద్దీ కొంచెం జలుబు చేసేసరికల్లా గాభరా పడిపోతాడు గాని, పిల్లలకేమండీ, బంగారంలా ఉంటారు. నాకు తెలియకపోతే మరీ చెప్పండురు—అసలు ఇంతసేపూ మరిచేపోయాను మా యింటికి రమ్మనడం. మా యింట్లో ఎవ్వరూ లేరు గనక మీరు మరేం మొగమాట పడక్కరలేదు."



ఆంధ్రశిల్పము (సింహాచలం)

—ఫొటో: ఎస్. సి. జోగారావు, కాకినాడ.

[illegible]
[illegible]
[illegible]



ఆంధ్ర శిల్పం—(పర్వవరం)　　ఫోటో : ఎస్. కె. జోగారావు, కాకినాడ.

# పార్కుబెంచీ సాక్షి

సహజీవనాన్ని చూడడానికయినా మీరు మా యింటికి రావాలి."

"మీ యింటికి నేను రావడానికి, మిమ్మల్ని చూడడమనే ఒక్క కారణం చాలదా? ఏమిటి అప్పుడే లేచిపోతున్నారు?"

"మరేం చెయ్యను? మీరంతా అప్పుడే వేసంకాలం వచ్చిందని పల్చటిచొక్కాలు తొడుక్కొని తిరుగుతున్నారా? నాకింకా ఈ వెయిస్టుకోటు, మఫ్లరు ఇవి ఉంటేనే గాని గడవదు. మంచు ఏమాత్రం పడదు. అలాగని సాయంకాలం నడక మానుకోడం ఇష్టపడను. రోజంతటికీ నేను కాస్త నడిచేది కూడా ఇంతే. రోజూ సామాన్యంగా ఇలా నడిచివచ్చి, నడిచిన అలసట తీరేవరకూ ఒక్క అయిదు నిమిషాలు మాత్రం ఈ బెంచీమీద కూర్చొని ఇంటికి వెళ్తాను. వెళ్ళినవెంటనే భోంచేస్తాను. పేపరు చదువుతూ పడుక్కొంటాను; తొమ్మిదిగంటలకి పడుక్కొని ఉదయం నాలుగుగంటలకల్లా లేస్తాను. నిద్రవేళ గాని, భోజనంవేళ గాని ఒక్క పిసరూ అటూ ఇటూ అయిందా, మర్నాడల్లా బాధగానే ఉంటుంది—అతికష్టంమీద అణచి ఉంచిన అవలక్షణాలన్నీ బైటికి ఉబుకుతాయి—తరవాత మందులతోనూ డాక్టర్లతోనూ తంటాలుపడేకంటె ముందునుంచే జాగ్రత్తగా ఉండడం మంచిదని. మరి శెలవు వస్తాను. ఈమారెప్పుడు వచ్చినా తిన్నగా మా యింటికే వచ్చేస్తే మనకు కాస్త తీరికగా నాలుగు సంగతులూ మాట్లాడుకొందికి వీలుంటుంది."

తరవాత సుమారు ఒక గంటసేపు అలాగే కూర్చున్నాను. నాకు ఆ బెంచీలో ఏదో ప్రత్యేకత ఉందనిపించింది. నాతోపాటు తానుకూడా ఈ ఒక్క గంటలోనూ చిత్రమయిన కొన్ని అంశాలు వింది ఒకమనిషి తననుగురించి తాననుకొనేదానికీ, ఇతరులనుకొనేదానికీ ఎంత భేదం ఉండడానికి వీలుందో అనుకొన్నాను. అంతే కాదు, ఒక స్థితినిగూర్చి, ఒక వ్యక్తినిగూర్చి, సుఖదుఃఖాలనుగూర్చి మనం చేసే నిర్ణయాలకు వెనుక మన మనస్థితి నడిపే భాగవతం చాలా ఉంటుంది. సుందర్రావు దృష్టిలో హయగ్రీవరావుకంటె సౌఖ్యవంతుడు లేడు; హయగ్రీవరావు దృష్టిలో సుందర్రావుకంటె సుఖపడే యోగ్యత గలవాడు లేడు - అంతే కాదు, సుందర్రావు అలా ఉండడమే అతని సుఖానికి కారణమని, నిజంగా మరి కాస్త డబ్బు నేదే ఉంటే, అతని ప్రస్తుతపు జీవితంలోని హాయి అంతరించి పోతుందేమో నన్నట్టు కూడా ధ్వనించింది హయగ్రీవరావు మాటల్లో.

ఆయీ సంగతులన్నీ నాతోపాటు పార్కు బెంచీ కూడా ఆకర్షించకపోలేదు - అయితే నాలో పూర్వాశ్రమానికి సంబంధించిన చాపల్యము అంతరించక ఇది ఇలా నడివిధిని పెడుతున్నాను. అయితే లోపల్లోపల ఉద్దేశము, ఈ కొద్దిసేపటిలో నేను వారిద్దరినీ కలుసుకొని, పరస్పర విరుద్ధములయిన మాటలను విన్నట్టుగానే, ఇది వారిద్దరూ చదవకూడదా అనే ఆశ మెదలకపోలేదు చదివి పరస్పరం సహకరించుకొని సుఖపడనీ మాననీ, అది నా పని కాదు, ఇద్దరూ అంతదగ్గరలో ఉండి కూడా పరస్పరం ఎంతటి విరుద్ధాభిప్రాయాలతో ఉన్నారో అన్నది ఎవ్వరికీ నొప్పి కలగకుండా తెలియజెయ్యడం అన్నది జరిగితే నా ఉద్దేశం చాలావరకు నెరవేరినట్లే.

★


**49** Persons are awarded prizes in our competition No. 35; 1st prize 14, 2nd prize 1, 3rd prize 32 and 4th prize 2 persons. Full particulars against 0-4-0 annas stamps.

## గెలవండి 25,000 గెలవండి

రిజిష్టర్డు నెం. 628. పోటీ నెం. 37.

సీలువేసియున్న మా అఫిషియల్ కీ సొల్యూషన్ మెసర్సు. ప్రీమియర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మద్రాసు వారివద్ద డిపాజిట్టు చేయబడియున్నది. వారి అధికారముతో అది ప్రకటించబడును. ప్రథమ బహుమతి ఆల్ కరెక్టు రు. 12,500. రెండవబహుమతి, మొదటి రెండు లైనులు కరెక్టు రు. 6,500 మూడవ బహుమతి, మొదటి ఒక లైన్ కరెక్టు రు. 3,500. నాలుగవ బహుమతి మొదటి రెండు నెంబర్లు కరెక్టు రు. 2,500 మా కీ సొల్యూషన్ ప్రకారం నిలువుగా, అడ్డంగా యెటైనా వుండవచ్చును.

RAISING COMPETITIONS

| | | | |
|---|---|---|---|
| 98 | 100 | 101 | 95 |
| 91 | 105 | 104 | 94 |
| 103 | 93 | 92 | 106 |
| 102 | 96 | 97 | 99 |

We hereby certify that the above is the [illegible] original deposited with us by Raising Competitions No. 35 on 28-2-55 in a sealed cover which was opened in our presence to-day and that a copy of the above [illegible] has been lodged with the Bank

For The Premier Bank of India Ltd.

## ఆఖరు తేది 12-4-55 ఫలితములు 27-4-55

ప్రవేశ రుసుము ఒక ఎంట్రీకి రు. 1/-; 6 ఎంట్రీలకు రు. 5/-; 14 ఎంట్రీలకు రు 10/-.

526

పూర్తి చేయవలసిన విధానము:—ఈ చదరములో 124 నుండి 139 వరకు గల అంకెలు నిలువునా అయిమూలలా అడ్డముగా ఎటు కూడినా 526 వచ్చేట్లు వేయాలి. ఒక అంకె ఒకమారే వాడాలి. సాదా కాగితము మీద ఎన్ని ఎంట్రీలైనా పంపవచ్చును. ప్రతి ఎంట్రీకింద, పోటీ పంపువారు తమ పేరు అడ్రసు స్పష్టంగా పెద్ద అక్షరాలతోను, అంకెలతోను ఇంగ్లీషులో వ్రాయాలి. సొమ్ము క్రాస్ చేసిన ఇండియన్ పోస్టల్ ఆర్డర్లుగాగాని, మనియార్డర్లుగాగాని పంపవచ్చును. మనియార్డరులైనచో మనియార్డరు రశీదులు పోటీ యెంట్రీల వెంట పంపవలెను. ప్రతి మనియార్డరు ఫారమునకు జతపరుచు కూపనులో సొమ్ము పంపువారు తనపేరు, అడ్రసు ఇంగ్లీషులో వ్రాయవలెను. "వసూలునుబట్టి బహుమతుల సొమ్ము మారుచుండును." ఈ పోటీలో మేనేజరు తీర్మానము ఆఖరు, చట్టబద్ధమైనది. 0-4-0 స్టాంపులు పంపినచో పోస్టులో ఫలితములలిస్టు పంపబడును. మా ప్రత్యేకరూల్సు, షరతులు బాగా తెలిసినవారే పోటీలో పాల్గొనవలెను.




**THE RAISING COMPETITIONS No. 37,**
**28 (3), Thandavaraya Gramani St., MADRAS-21.**